క్లుప్తంగా

పోటీల్లో క్రీడా స్ఫూర్తి ప్రధానం



గద్వాలటౌన్: గెలుపోటముల కంటే పోటీల్లో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించడం ప్రధానమని సీనియర్ క్రీడాకారులు పేర్కొన్నారు. క్రీడాకారుడు రమేష్ స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా గెలుపొందిన జట్లకు నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. విజేతగా నిలిచిన బీఎస్కే యూత్ జట్టుకు రూ.20 వేలు, రన్నర్‌గా నిలిచిన గంజిపేట యూత్ జట్టుకు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో శివరాజు, తిమ్మన్న, పరేష్‌బాబు, రైల్వేపాష, రాజు, పరశురాం, వంశీ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చేనేత రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ



గద్వాలటౌన్: తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మేడం రామకృష్ణను నియమించారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గద్వాలకు చెందిన చేనేత సంఘం నాయకుడు మేడం రామకృష్ణను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. రామకృష్ణ నియామకం పట్ల గద్వాల చేనేత సంఘం, పద్మశాలి సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డంతా చెత్తనే!



ఉండవెల్లి: మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో రోడ్డుపై నీరు పోయడంతో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు నడవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. మురుగు, చెత్త ఒక చోట చేరి ప్రజలు దుర్వాసన వెదజల్లుతోంది. రోడ్లపై చెత్త వేయడమే కాకుండా, నీరు పోయడంతో మురుగు, చెత్త వల్ల వ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రజలు ఆవేదనకు గురవుతున్నారు. చెత్త, మురుగును తొలగించాలని ప్రజలు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముళ్ల పొదలు తొలగించండి



రాజోళి: కొత్త రాజోళిలోని పునరావాస గృహాల్లో ముళ్ల పొదలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. వర్షాకాలం కావడంతో విషసర్పాలు తిరుగుతున్నాయని, ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు ఇళ్ల మధ్య ఉండడంతో రాత్రి సమయంలో బయటకు రావాలంటే భయంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇళ్ల మధ్యలో పాడుబడిన ఇళ్లు ఉండటం, అందులో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. వర్షాలు కురుస్తుండటంతో రోడ్లు, ఇళ్ల మధ్య పరిసరాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.

సైక్లింగ్ పోటీలు ప్రారంభం



మక్తల్: పట్టణంలోని జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు తాన్‌సింగ్, విశ్రాంత పీఈటీ గోపాలం జెండా ఊపి ర్యాలీ సైక్లింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి వచ్చే నెల 4నుంచి 6 వరకు జనగామలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీలు అంబ్రేష్, దామోదర్, రమేష్, సౌమ్య, రేణుక, పుష్పలత, ప్రసన్నకుమారి, శ్రీలత, స్వరూప, మీనకుమారి పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ గోదాం శిథిలం



శిథిలమైన సివిల్ సప్లయ్ గోదాం

- 2 మున్సిపాల్టీలు, 5 మండలాలకు గోదాం ఒక్కటే
- రేషన్ బియ్యం సరఫరాలో ఇబ్బందులు
- నూతన గోదాం నిర్మించాలి

అయిజ: ప్రభుత్వం పేదలకు చౌకధర దుకాణాల ద్వారా బియ్యం అందిస్తోంది. బియ్యం నిల్వ చేసేందుకు పౌరసరఫరాల శాఖకు సంబంధించిన గోదాంలు మండలానికి ఒకటి లేకపోవడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. అయిజ పట్టణంలోని మార్కెట్ సబ్ యార్డ్‌కు సంబంధించిన గోదాంను సివిల్ సప్లయ్ అధికారులు అద్దెకు తీసుకొని కొన్ని సంవత్సరాలుగా ఆ గోదాంలోనే సరుకులు నిల్వ చేస్తున్నారు. దాని కోసం ప్రతినెల రూ.5వేలు అద్దె చెల్లిస్తున్నారు. అయిజ, వడ్డేపల్లి మున్సిపాలిటీలతో పాటు రాజోళి, మల్దకల్, గట్టు మండలాల చౌకధర దుకాణాలకు అందించే బియ్యాన్ని ఈ గోదాంలో నిల్వ చేయడంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతినెల గోదాంకు సుమారు 1100 టన్నుల బియ్యం వస్తుంది. నిల్వ చేసుకోవడానికి గోదాంలో స్థలం సరిపోక 4 నుంచి 5 విడతలుగా నిల్వ చేస్తున్నారు. చౌకధర దుకాణాలకు సరైన సమయంలో సరుకులు చేరకపోవడంతో వినియోగదారులకు సరుకులు అందడంలేదు.

ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం..

ఎంఎల్‌ఎస్ పాయింట్ గోదాం నిర్మించేందుకు ప్రభుత్వ స్థలంలోని సర్వే నెంబర్ 936లో 15 ఏళ్ల క్రితం 20 గుంటల స్థలాన్ని కేటాయించారు. గోదాం నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. ఆ స్థలాన్ని కొందరు కబ్జా చేశారు. పాలకులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఆ స్థలం ఇతరులకు అన్యాక్రాంతమైంది. సంబంధిత అధికారులు స్పందించి సరిపడా గోదాంలను ఏర్పాటు చేయాల్సి ఉంది.

నివేదిక పంపించాం..

ఒక్కటే గోదాం ఉండడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో బియ్యం బస్తాలు నిల్వ చేసుకోవడానికి ఇబ్బందిగా ఉంటోంది. ఉన్న ఒక్క గోదాం కూడా శిథిలమైంది. అదనంగా గోదాంలు నిర్మించాలని మూడు సంవత్సరాల క్రితం ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. మంజూరైతే నూతన గోదాంలు నిర్మించేందుకు కృషి చేస్తాం.

– రాము, గోదాం ఇన్‌చార్జి

కొత్త గోదాం నిర్మించాలి



అయిజలో నిర్వహిస్తున్న గోదాం శిథిలమైంది. దాని స్థానంలో కొత్త గోదాం నిర్మించాలి. ఇప్పుడున్న గోదాం కూడా చిన్నగా ఉండడంతో లారీల్లో తెచ్చిన సరుకులు నిల్వ చేసుకునేందుకు వీలుకావడం లేదు. గోదాంలో నిల్వ చేసిన బియ్యం బస్తాలు కొన్ని చౌకధర దుకాణాలకు తరలిస్తే గాని మిగిలిన బియ్యం బస్తాలు నిల్వ చేసుకునేందుకు వీలు కావడంలేదు. విశాలంగా నూతన గోదాంను నిర్మిస్తే బాగుంటుంది.

– భాజా, అయిజ

ప్రతి మండలానికి గోదాం నిర్మించాలి



రెండు మున్సిపాలిటీలు, ఐదు మండలాలకు కలిపి అయిజలో ఒకటే గోదాం ఉంది. అదికూడా శిథిలమైంది. ఒక్కటే గోదాం ఉన్నందువల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. చౌకధర దుకాణాలకు సరైన సమయంలో సరుకులు అందడం లేదు. వినియోగదారులకు ఆలస్యంగా సరుకుల పంపిణీ చేస్తున్నారు. ప్రతి మండలానికి ఒక గోదాం నిర్మించాలి.

– వెంకటేశ్వర్ రెడ్డి, ఎక్లాస్ పురం

దాడులు అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి నర్మద

ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి నర్మద

గద్వాల అర్బన్: మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి నర్మద అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల హక్కుల సాధనకు ఐద్వా నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. ఈనెల 21,22,23 వ తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెంలో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభలకు జిల్లాలోని మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెలమ్మ, జయమ్మ, సుజాత, రత్నమ్మ, పద్మ, తదితరులు ఉన్నారు.

జిల్లా మహాసభలు జయప్రదం చేయండి



మహాసభల కర పత్రాలు విడుదల చేస్తున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాజు, ఈదన్న

అలంపూర్ రూరల్: సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కమిటీ సభ్యులు రాజు, ఈదన్న తెలిపారు. మండలంలోని క్యాతూర్‌లో ఆదివారం సీపీఎం మూడో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. ఈ నెల 25, 26వ తేదీల్లో జిల్లా మహాసభలు జిల్లా కేంద్రంలోని కన్వెన్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభలకు రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, టీ సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంపీ రమణ హాజరవుతారని తెలిపారు. క్యాతూర్ గ్రామ సీపీఎం కార్యదర్శిగా బంగారు రఫీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాజు, ఈదన్న తెలిపారు. కార్యక్రమంలో రామాంజనేయులు, ఎండీ రజాక్, భాను, రాము, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి

అయిజ: సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో హమాలీ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు ఈశ్వర్, సవారి, పెద్ద రాముడు, మద్దిలేటి, నాగరాజు, వీరేష్, తిరుమలేష్ పాల్గొన్నారు.

సమాజ జాగృతికి నిరంతర కృషి



గద్వాలలో పద సంచాలన్ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

గద్వాలలో ఆర్‌ఎస్‌ఎస్ పద సంచాలన్

గద్వాలటౌన్: సమాజాన్ని జాగృతం చేయడానికి, హిందువుల్లో సంఘటిత శక్తిని పెంపొందించేందుకు ప్రతి స్వయం సేవకుడు నిరంతరం కృషి చేయాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విభాగ్ ప్రచారక్ దేవేందర్‌రాజు పిలుపునిచ్చారు. గద్వాల పట్టణంలో ఆదివారం సాయంత్రం ఆర్‌ఎస్‌ఎస్ కవాతు (పద సంచాలన్) నిర్వహించారు. పట్టణ ప్రధాన రహదారులు, కూడళ్ల మీదుగా సాగిన ఈ పథ సంచాలన్‌లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యాకర్తలతో పాటు బీజేపీ, హిందూ ధార్మిక సంఘాల నాయకులు, వ్యాపార వర్గాలు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో కవాతులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసవి ఈవెంట్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ హితం కోసమే ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తుందని చెప్పారు.యుద్ధాలు, ప్రకృతి విపత్తుల వేళ ఆర్‌ఎస్‌ఎస్ అందరికంటే ముందుండి సేవలు అందిస్తుందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘ్ చాలక్ గోపాలరావు ఏక్బోటే మాట్లాడారు.



అయిజలో..

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

అయిజ: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు రూట్ మార్చ్ నిర్వహించారు. పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం నుంచి పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, తెలంగాణ చౌరస్తా మీదుగా కర్నూల్–రాయచూర్ రోడ్డు వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో అయిజ, మల్దకల్, గట్టు, రాజోళి మండలాల ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, హిందు వాహిని, భారతీజ జనతాపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులను ముంచుతున్న ప్రభుత్వం



గద్వాల అంబేద్కర్ చౌక్‌లో ధర్నా చేపడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు.

- ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం
- బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో

సాక్షి, నెట్‌వర్క్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతు భరోసా పేరుతో ఎకరానికి రూ.15వేలు ఇస్తామని, ఒకే సారి రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని రైతులను నట్టేట ముంచిందని బీఆర్‌ఎస్ నాయకులు ధ్వజమెత్తారు. ఆదివారం వివిధ మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మలు, సీఎం, మంత్రుల దిష్టిబొమ్మలు దహనం చేశారు. ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో ధర్నా నిర్వహించారు. కేటీదొడ్డిలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. అయిజలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గట్టులో బస్టాండ్ ఆవరణలో బీఆర్‌ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు.



కేటీదొడ్డిలో ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



అయిజలో..



గట్టులో..

ప్రమాదమని తెలిసినా పట్టదా?



జూలెకల్ ఆర్డీఎస్ కెనాల్ సమీపంలోని కల్వర్టు వద్ద ప్రమాదకరంగా గుంత

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని అలంపూర్–రాయచూర్ ప్రధాన రహదారిలో గుంతలు పడి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులకు పట్టడంలేదని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని జూలెకల్ స్టేజీ నుంచి వెంకటాపురం స్టేజీ వరకు గతంలో నిర్మించిన పాత కల్వర్టుల వద్ద బీటీ రోడ్డు గుంతలుపడి ప్రయాణికులు తరచు ప్రమాదాల బారిన పడుతున్నారు. డబుల్ రోడ్డులో ఉన్న పాత కల్వర్టులు దగ్గరగా ఉండటం, కల్వర్టుల వద్ద గుంతలు పడటంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో వాహనాలు ఢీకొనడం, అదుపుతప్పి క్రింద పడటం జరుగుతోంది. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి డబుల్ రోడ్డుకు తగ్గట్టుగా కల్వర్టులు నిర్మించి, గుంతలు పడిన చోట మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1989–1990 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పట్లో బోధించిన ఉపాధ్యాయులు సీతారామయ్య, వెంకటచలం, నాగన్‌గౌడ్, ప్రస్తుత జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహ్మద్ ఆలీ, గోవర్ధన్‌రెడ్డి, వీరన్న, రవీందర్‌రెడ్డి, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చౌడేశ్వరి మాత ఉత్సవాలు

ఊట్కూరు: మండలంలోని రెండు రోజులుగా కొనసాగుతున్న చౌడేశ్వరి దేవి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఈమేరకు.. ఆలయ ప్రాంగణంలో హోమం, జ్యోతిప్రదక్షణ, బలి, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గండిమి తోటప్ప, బుద్ధి విఠోభ, రిటైర్డ్ బ్యాంక్ అధికారి కోటి సుభాష్, రాజశేఖర్, వడ్ల మోనప్ప పాల్గొన్నారు.

నేడు చౌడేశ్వరి దేవి అఖండ జ్యోతి ఉత్సవాలు

కోస్గి: పట్టణంలోని శ్రీ చౌడేశ్వరి దేవి అఖండ జ్యోతి ఉత్సవాలు నేటి నుంచి రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీ, తొగుట వీర క్షత్రియ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకల్లో భాగంగా సోమవారం పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు ఉంటుందన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని, అధిక సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాలని సూచించారు.

జరిమానా ఎవరికి విధించాలి?



పంచాయతీ రాజ్ కార్యాలయం ఎదురుగా రోడ్డుపై పారేసిన చెత్త

జిల్లా కేంద్రంలో రోడ్లపై చెత్తను ఎక్కడపడితే అక్కడ పారబోస్తున్నారు. పంచాయతీ రాజ్ కార్యాలయం ఎదురుగా చెత్త వేస్తే జరిమానా అంటూ బోర్డును ఏర్పాటు చేశారు. దానికి అనుకొని పెద్ద ఎత్తున్న వ్యర్థాలు పారబోస్తున్నా.. అధికారులకు మాత్రం కన్పించడం లేదు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు, పాదచారులు దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. వెంటనే ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– గద్వాల అర్బన్

దర్జాగా దాబాల్లో సిట్టింగ్



దాబాలో మద్యం తాగుతున్న మందుబాబులు



దాబాలో సిట్టింగ్ కూర్చున్న మందు బాబులు

- బహిరంగా ప్రదేశాల్లో విచ్చలవిడిగా మద్యపానం
- చెక్‌పోస్ట్ ఎదురుగా మద్యం అమ్మకాలు

కేటీదొడ్డి: దాబాల్లో లిక్కర్ తాగడంపై నిషేధం ఉన్నా, దర్జాగా సిట్టింగులు నిర్వహిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో దాబా హోటళ్లు, కిరాణం షాపుల్లో మందుబాబుల విందులు నిత్యకృత్యం. దాబా యజమానులు ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక గదుల ఏర్పాటు చేయడమే కాక అధిక ధరలకు మద్యం సరఫరా చేస్తున్నారు. గతంలో గుట్టుచప్పుడు కాకుండా సిట్టింగులు ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం పట్టపగలు, ఆరుబయట టేబుళ్లు వేసి మరీ మద్యం తాగేందుకు అనుమతిస్తున్నారు. నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులు దాబా నిర్వాహకులపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శలున్నాయి.

నందిన్నె చెక్‌పోస్టు ఎదురుగా మద్యం అమ్మకాలు తెలంగాణ సరిహద్దులోని నందిన్నె చెక్‌పోస్టులో దాబాలలో యథేచ్ఛగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారు. దాబాలలో మద్యం అమ్మకాలకు అనుమతి లేకున్నా అధికారుల అండదండలతో ఈ దందా కొనసాగుతోంది. మద్యం అక్రమ రవాణా కోసం తెలంగాణ, కర్ణాటక సరిహద్దు ప్రాంతం నందిన్నె వద్ద సివిల్, ఎక్సైజ్ శాఖ పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టు ఎదురుగా దాబాలలో దర్జాగా మద్యం విక్రయాలు చేయడం విశేషం. చెక్‌పోస్టు పరిసర ప్రాంతాల్లో బహిరంగంగా మందుబాబులు మద్యం తాగుతున్న ఫోటోలు సోషల్ మీడియాల్లో చక్కర్లు కొట్టాయి. సివిల్ పోలీలుసులు కాని, ఇటు ఎక్సైజ్ శాఖ పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

మద్యం అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తప్పవు

చెక్‌పోస్టు ఎదురుగా మద్యం అమ్ముతున్నట్లు మా దృష్టికి రాలేదు. గ్రామాల్లోని అన్ని బెల్టు షాపుల్లో, చిన్న చిన్న దాబాల్లో, కిరాణం షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఎవరైనా మద్యం అమ్ముతున్నట్లు తెలిస్తే తనిఖీ నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం.

– గణపతిరెడ్డి, ఎక్సైజ్ సీఐ